తిప్పగుంట డ్రైయిన్‌తో తిప్పలు

- మురుగునీరు ముందుకు సాగని పరిస్థితి
- కలుషిత వ్యర్థాలతో వెదజల్లుతున్న దుర్వాసన



కలుషితమైన నీటితో ప్రవహిస్తున్న తిప్పగుంట డ్రైయిన్

రామవరప్పాడు: నగరం నుంచి ఆటోనగర్ మీదుగా రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో ప్రవహిస్తూ రైవస్ కాలువలో కలుస్తున్న తిప్పగుంట డ్రైయిన్‌తో ఏళ్ల తరబడి తిప్పలు తప్పడం లేదు. ఆటోనగర్‌లో పలు కంపెనీల నుంచి విడుదలయ్యే రసాయనాలు, వ్యర్థాలు ఈ డ్రైయిన్‌లోనే కలుస్తున్నాయి. పైగా దొంగచాటుగా జరుగుతున్న వ్యర్థాల డంపింగ్ ఫలితంగా డ్రైయిన్‌లోని నీరు కలుషితమై తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. నగరానికి ఆనుకుని ఉన్న గ్రామాలైన రామవరప్పాడు, ప్రసాదంపాడు ప్రజలకు కలుషితమైన ఈ డ్రైయిన్‌తో ఇబ్బందులు తప్పడం లేదు.

డంప్ చేస్తున్న కలుషిత వ్యర్థాలు

ఈ డ్రైయిన్‌లో కాలం చెల్లిన వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న కుళ్లిన వ్యర్థాలతోపాటు ఆటోనగర్ నుంచి వెలువడుతున్న రసాయనాలు కూడా ఈ డ్రైయిన్‌లోనే కలుపుతున్నారు. వీటితోనే ఇబ్బందులు పడుతుంటే బల్లెంవారి వీధి, విజయ ఆగ్రో సమీపంలో మాంసపు, కాలం చెల్లిన పదార్థాలను రాత్రుళ్లు ఈ డ్రైయిన్‌లో దొంగచాటుగా కలుపుతున్నారని స్థానికులు వాపోతున్నారు. వీరి చర్యలతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోందని, రోగాలు కొని తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణలో డ్రైయిన్

మురుగునీరు సజావుగా పారుదలకు నోచుకుని ఈ డ్రైయిన్ రానూ రానూ ఆక్రమణలకు గురవుతోంది. ప్రసాదంపాడు శ్రీ శక్తి కల్యాణ మండపం సమీపంలో డ్రైయిన్‌ను ఇష్టారాజ్యంగా ఆక్రమించినా.. సంబంధిత అధికారులకు మాత్రం పట్టడంలేదు. ఈ మార్గంలో ఎక్కువగా కంపెనీలు, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు జరిగాయి. వీరి కట్టడాలకు ముందు డ్రైయిన్ ఉండటంతో అనధికారంగా తూములు ఏర్పాటు చేసి డ్రైయిన్‌ను పూడ్చేస్తున్నారు. ఈ చర్యల ఫలితంగా డ్రైయిన్ కుంచించుకుపోయి మురుగునీటి పారుదల సాఫీగా జరగడం లేదు. వర్షాకాలంలో డ్రైయిన్ పొంగి పొర్లడానికి ఈ ఆక్రమణలు కూడా కారణమవుతున్నాయి.

ధ్వంసమైన రేకులు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతీయ రహదారిపై ప్రయాణం చేసే సమయంలో డ్రైయిన్ దుస్థితిని గమనించి ఆధునీకరించాలని, దుర్వాసన వెదజల్లకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో ఆఘ మేఘాల మీద డ్రైయిన్‌ను కొంత మేర ఆధునీకరించారు. ప్రసాదంపాడు శ్రీ శక్తి కల్యాణ మండపం వద్ద, రిలయన్స్ షాపింగ్ మాల్ వద్ద ఓపెన్ ఉన్న డ్రైయిన్‌పై యుద్ధప్రాతిపదికన రేకులతో మూసి వేయించి చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం డ్రైయిన్‌పై ఏర్పాటు చేసిన రేకులు ధ్వంసమయ్యాయి. వీటి బాగోగులు పట్టించుకోకపోవడంతో డ్రైయిన్‌కు మరల అధ్వాన పరిస్థితి దాపురించింది. నిత్యం తీవ్ర దుర్వాసన వెదజల్లుతుండటంతో ప్రయాణికులతో పాటు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి

నివాసాలకు అతి సమీపంలో ఉన్న తిప్పగుంట డ్రైయిన్‌తో పడరాని పాట్లు పడుతున్నామని సమీప నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్య జటిలంగా మారుతోందని వాపోతున్నారు. ప్రస్తుతం డ్రైయిన్ పర్యవేక్షణ కొరవడటంతో ఇష్టారాజ్యంగా కలుషితం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోళ్ల వ్యర్థాలు, చనిపోయిన జంతువుల కళేబరాలు, కాలం చెల్లిన ఆహార పదార్థాలను ఇక్కడే డంప్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. శ్రీశక్తి కల్యాణ మండపం, రిలయన్స్ షాపింగ్ మాల్ వద్ద డ్రైయిన్‌పై వేసిన రేకులు ధ్వంసమయ్యాయని మరల వాటిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఈ సమస్యలపై స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రెవస్ కాలువలో కలుస్తున్న తిప్పగుంట డ్రైయిన్ మురుగు

క్లుప్తంగా

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి



పెనమలూరు: కానూరులో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. అశోక్ జిమ్, మాతృ హృదయ్ స్వచ్ఛంద్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకుడు తాళ్లూరి అశోక్ పటేల్ ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో వల్లభాయ్ పటేల్ ఆత్మవిశ్వాసంతో, మనో ధైర్యంతో పోరాడారన్నారు. నేటి యువతకు వల్లభాయ్ పటేల్ ఆదర్శమని తెలిపారు. కార్యక్రమంలో బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సభ్యుడు ఈదా రాజేష్, క్రీడాకారులు, స్వచ్ఛంద సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మా క్యాంటీన్ నిర్వహణ అభినందనీయం



కంకిపాడు: అమ్మా క్యాంటీన్ నిర్వహణ అభినందనీయమని కంకిపాడు సీఐ జె.మురళీకృష్ణ అన్నారు. డొక్కా సీతమ్మ స్ఫూర్తితో పచ్చిపాల కనక దుర్గారావు ఆధ్వర్యాన కంకిపాడు ఆర్‌అండ్‌బీ బంగ్లా సమీపంలో ఏర్పాటుచేసిన అమ్మా క్యాంటీన్ 75 రోజులు పూర్తి కావడంతో నిర్వాహకుడు కనక దుర్గారావును దీపావళి పర్వదినం సందర్భంగా గురువారం ప్రత్యేకంగా అభినందించారు. సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ దుర్గారావు సేవాభావం నేటి తరం యువతకు ఆదర్శప్రాయమన్నారు. ప్రతి ఒక్క రూ సేవా కార్యక్రమాల్లో పాల్గొని పేదలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగుల మూడి రాజు, వివిధ సంస్థల ప్రతినిధులు సిరవెళ్ల చిట్టిబాబు, తాడితోటి నరసింహారావు, ఎంఎస్ రాజు పాల్గొన్నారు.

యోగాలో విద్యార్థికి బంగారు పతకం



పెనమలూరు: జాతీయస్థాయిలో జరిగిన యోగా పోటీల్లో కానూరు భాష్యం పాఠశాల 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ధీరజ్ శ్రీకృష్ణ బంగారు పతకం గెలిచాడు. గత నెల 24 నుంచి 27వ తేదీ వరకు హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థా యి సబ్ జూనియర్స్, జూనియర్స్ యోగా పోటీ ల్లో ధీరజ్ శ్రీకృష్ణ సత్తాచాటి బంగారు పతకం సా ధించాడు. ఈ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావు, జెడ్‌ఈవో జోసఫ్ జోషి, ఉపాధ్యాయులు అభినందించారు.

రూ. 50 కోట్లతో అభివృద్ధి పనులు

ఉయ్యూరు: పెనమలూరు నియోజకవర్గంలో రూ. 50 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని గండిగుంట గ్రామంలో నూతనంగా నిర్మించనున్న రెండు సీసీ రోడ్లకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే బోడె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తుందన్నారు. రహదారులు, డ్రైయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్పంచ్ గెత్తం అనుపమ, ఎంపీడీఓ శేషగిరిరావు, నాయకులు దండమూడి చౌదరి, సత్యనారాయణ, సాంబశివరావు, ప్రవీణ్ పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి యువకుడి మృతి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ద్విచక్రవాహనానికి కుక్క అడ్డు రావడంతో దానిని తప్పించే క్రమంలో కింద పడిపోయిన యువకుడు మృతిచెందాడు. పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో గల ఆటోనగర్‌లో జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెనమలూరు మండలం కానూరు సనత్‌నగర్‌కు చెందిన రహీమ్ (20) ఆటోనగర్ ఫైర్ స్టేషన్ సమీపంలోని ఒక ఫౌండ్రీలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 29న రహీమ్ ఫౌండ్రీలో పని ముగించుకుని రాత్రి తొమ్మిది గంటల సమయంలో తన ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. ఆటోనగర్ 5వ రోడ్‌లో కుక్క అడ్డు రావడంతో దానిని తప్పించే క్రమంలో రహీమ్ బైక్‌కు అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో బైక్‌తోపాటు అతను కూడా కిందపడిపోవడంతో తలకు బలమైన గాయం అయ్యింది. వెంటనే అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి కరీమ్ ఫిర్యాదు మేరకు పటమట పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి నుంచి యనమలకుదురులో కార్తిక ఉత్సవాలు



యనమలకుదురులో కొండపై రామలింగేశ్వరస్వామి ఆలయం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలోని కొండపై వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో శనివారం నుంచి కార్తిక మాసం ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయి. డిసెంబర్ 1వ తేదీ వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో పూజలకు ఏర్పాట్లు చేశారు.

కార్తిక మాసంలో పూజా వివరాలు..

ఆలయంలో కార్తిక మాసం పూజా వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 4వ తేదీ మొదటి సోమవారం ఉదయం 10 గంటలకు శాంతి కల్యాణం, 5న నాగుల చవితి, 11న రెండవ సోమవారం శాంతికల్యాణం, 12న ఉదయం 11.30 గంటలకు భస్మాభిషేకం, 13న సాయంత్రం 5 గంటలకు నందీశ్వర అభిషేకం చేస్తారు. 15న కార్తిక పౌర్ణమి, 18న మూడవ సోమవారం శాంతి కల్యాణం, 19న పార్వతీదేవి అమ్మవారికి అన్నపూర్ణాదేవి అలంకరణ, స్వామివారి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఉదయం 8 గంటలకు కుంభాభిషేకం, 11 గంటలకు అన్నసంతర్పణ చేస్తారు. 25న నాల్గో సోమవారం శాంతి కల్యాణం, 26న ఉదయం 10 గంటలకు స్వామివారికి బిల్వార్చన, 29న మాసశివరాత్రి, డిసెంబర్ 2న ఉద్వాసన స్వామివారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహిస్తారు. అభిషేకం చేసిన భక్తులు ప్రసాదం పంపిణీ చేస్తారు.

స్వామివారి అభిషేక సమయాలు

కాగా కార్తిక మాసం సందర్భంగా స్వామివారికి ప్రత్యేకాభిషేకం ఉంటుంది. ప్రతి రోజూ ఉదయం 5 గంటలకు, 6.30 గంటలకు, 8 గంటలకు, 9.30 గంటలకు,10.30 గంటలకు, 11.30 గంటలకు అభిషేకం చేస్తారు. భక్తులు పరోక్ష గోత్ర నామాలతో పూజలు చేయాలనుకుంటే ఆలయ అధికారులను సంప్రదించాలి. ఈ ఆలయంలో 11 సోమవారాలు 11 ప్రదక్షిణలు చేసి స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం చేయడం వల్ల వివాహాలు, విదేశీ విద్య, ఉద్యోగం, పదోన్నతులు, అలాగే శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి 108 ప్రదక్షిణలు చేస్తే సంతానం కలుగుతుందని చెబుతారు.

కమ్యూనిటీ హాలుకు స్థలం వితరణ



వితరణగా ఇస్తున్న స్థలాన్ని ప్రారంభిస్తున్న పొట్లూరి, జాస్తి

గన్నవరం: మండలంలోని కేసరపల్లి గ్రామ శివారు సుందరయ్య నగర్‌లో గంగిరెద్దులు కులస్తుల కమ్యూనిటీ హాలు నిర్మాణానికి గన్నవరం విమానాశ్రయం సలహా కమిటీ సభ్యుడు పొట్లూరి బసవరావు మూడు సెంట్ల స్థలాన్ని వితరణగా ఇచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని విరాళంగా ఇచ్చిన స్థలాన్ని కాలనీ పెద్దలకు అప్పగించారు. ఈ సందర్భంగా బసవరావు మాట్లాడుతూ వెనుకబడిన గంగిరెద్దుల కులస్తుల అభ్యున్నతికి రూ. 30 లక్షల విలువైన స్థలాన్ని వితరణ చేసినట్లు తెలిపారు. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రూ. 19 లక్షలు నిధులు కేటాయించినట్లు చెప్పారు. గ్రామ సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, ఉప సర్పంచ్ జాస్తి శ్రీధర్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు శొంఠి కిషోర్, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

లక్ష్య నిర్దేశంతో ఉన్నత శిఖరాలు



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న వెంకట సాంబశివరావు

ఉయ్యూరు: లక్ష్య నిర్దేశం, క్రమశిక్షణతో ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు సాధ్యమని లయన్స్ జిల్లా కేబినెట్ డెప్యూటీ సెక్రటరీ నూకల వెంకట సాంబశివరావు అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో తన తల్లిదండ్రులు నూకల లింగమూర్తి, సుబ్బమ్మ విద్యాకానుక పేరిట శుక్రవారం నలుగురు విద్యార్థులు ఒక్కొక్కరికి రూ. 5 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిత ఉంటుందని, తల్లిదండ్రులు తమ బిడ్డలను ఉన్నత చదువులు చదివించాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నెరెళ్ల తేజ, జోనల్ చైర్మన్ ఎండీ ఇస్మాయిల్, ప్రతినిధులు నెల్లి రాంబాబు, దీనవహి ప్రసాద్, డాక్టర్ రావులపల్లి సుధాకర్, కుటుంబరాజు పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు: కంకిపాడు–రొయ్యూరు రోడ్డు అభివృద్ధి పనులకు డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీతో రూ 3.75 కోట్లు మంజూరు అయ్యాయి. దీంతో రోడ్డు అభివృద్ధి పనులకు శుక్రవారం గొడవర్రు గ్రామంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ కంకిపాడు–రొయ్యూరు రోడ్డు అధ్వానంగా మారడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి కృష్ణకిషోర్, ఎంపీడీఓ పి. అనూష, నేతలు తుమ్మలపల్లి హరికృష్ణ, గోగినేని వెంకట రమణ, యలమంచిలి సాంబశివరావు, ముప్పా రాజా, సుదిమళ్ల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు



ప్రమిదలతో దీపావళి చేసుకుంటున్న చిన్నారులు



ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో దీపావళి వేడుకల్లో ప్రిన్సిపాల్ జాకీరా సుల్తానా, విద్యార్థులు

గన్నవరం రూరల్: మండలంలోని గ్రామాల్లో గురువారం దీపావళి పర్వదినాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. లక్ష్మీదేవిని కొలిచారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి జరుపుకుంటున్నట్లు వేద పండితులు దేవాలయాల్లో భక్తులకు అభిభాషణ చేశారు. ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ షేక్ ఇమాం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ షేక్ జాకీరా సుల్తానా విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బందితో దీపా వళి వేడుకలు నిర్వహించారు. దీపకాంతులతో గృహాలను ప్రజలు అలంకరించారు.

ఉయ్యూరు: దీపావళి పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. ప్రతి ఇంటా అందమైన రంగవల్లులు తీర్చిదిద్ది, ప్రమిదల దీప కాంతులతో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. చిన్నారులు టపాసులు కాల్చి సంతోషంగా గడిపారు. మిఠాయిలు తినిపించుకుని వేడుకలు చేసుకున్నారు.

కంకిపాడు: దీపావళి పర్వదినాన్ని గురువారం ప్రజలు సంతోషంగా జరుపుకొన్నారు. సాయంత్రం చీకటి పడిన తర్వాత దీపాలు వెలిగించి, ఇళ్ల ముంగిట అందమైన రంగవల్లులు తీర్చిదిద్దారు. దీప కాంతుల నడుమ బాణసంచా కాల్చి చిన్నారులు, యువత సందడి చేశారు.

విజయవాడరూరల్: గ్రామాల్లో ప్రజలు దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. నున్న గ్రామంలోని శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి దేవస్థానంలోని మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపాఠశాల విద్యార్థులు గడ్డితో తయారు చేసిన నరకాసురుని బొమ్మను టపాసులతో పేల్చారు. పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో శ్రీనాగ సాయిబాబా దీక్షమందిరంలో దీపావళి వేడుకలను జరుపుకొన్నారు. భక్తులకు అన్నసంతర్పణ జరిగింది.

ఆలస్యంగా పింఛన్ల పంపిణీ



కంకిపాడు పంచాయతీ వద్ద నిరీక్షిస్తున్న పింఛన్‌దారులు



కడవకొల్లులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ శేషగిరిరావు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో కమిషనర్ తాడిగడప గ్రామంలో పింఛన్‌లు పంపిణీ చేశారు. తాడిగడప మున్సిపాలిటీలో 12,704 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ 5.41 కోట్ల నిధులు మంజూరు చేసి విడుదల చేశారు. అదేవిధంగా పెనమలూరు మండలంలో 5,750 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ. 2.40 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఉదయం ఆరు గంటలకు పింఛన్‌లు కొందరికి పంపిణీ చేసిన తర్వాత సర్వర్ పని చేయలేదు. మరల మధ్యాహ్నం నుంచి సర్వర్ పని చేయడంతో పింఛన్‌లు ఇచ్చారు. అయితే లబ్ధిదారులు పింఛన్‌ల కోసం సచివాలయాల చుట్టూ తిరిగారు.

కంకిపాడు: పింఛన్ కోసం శుక్రవారం లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడ్డారు. గంటల కొద్దీ పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు పడాల్సి వచ్చింది. మండలం వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ సాంకేతిక సమస్య కారణంగా పింఛన్ల పంపిణీ సజావుగా సాగలేదు. పింఛన్ చేతికి అందకపోవడంతో లబ్ధిదారులు పింఛన్ సొమ్ము కోసం పంచాయతీ ఆఫీసుల చుట్టూ తిరిగారు. సర్వర్లు పనిచేయడం లేదని అధికారులు చెప్పడంతో ఆ కార్యాలయాల వద్దే నిరీక్షించారు.

పింఛన్ పంపిణీలో సాంకేతిక సమస్యలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం పలు గ్రామాల్లో శుక్రవారం పింఛన్ల పంపిణీలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో ఉదయం నుంచి సర్వర్లు పని చేయకపోవడంతో పింఛన్ పంపిణీకి ఆటంకం ఏర్పడింది. దీంతో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఉయ్యూరు: ఉయ్యూరు మున్సిపాలిటీలోని 20 వార్డుల్లోనూ, మండలంలోని 11 గ్రామాల్లో శుక్రవారం పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. మున్సిపాలిటీలో పింఛన్ల పంపిణీని కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. మండలంలోని కడవకొల్లు గ్రామంలో ఎంపీడీఓ శేషగిరిరావు లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. గండిగుంట గ్రామంలో పింఛన్ల పంపిణీని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పరిశీలించారు. కాగా సాంకేతిక సమస్యల కారణంగా పింఛన్ల పంపిణీలో జాప్యం తలెత్తింది. దీంతో లబ్ధిదారులు పింఛన్లు తీసుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

విజయవాడరూరల్: సామాజిక పింఛన్లు శుక్రవారం సర్వర్లు పని చేయకపోవడంతో లబ్ధిదారులు పడిగాపులు పడాల్సి వచ్చింది. సిబ్బంది సర్వర్లు పని చేయడం లేదు కొంతసేపు ఆగాలని చెప్పడంతో లబ్ధిదారులు ఇంటికి వెళ్లి రాలేక సచివాలయాల వద్దే గంటల తరబడి పడిగాపులు గాచారు. ప్రతి గ్రామ సచివాలయం వద్ద పింఛన్ల కోసం లబ్ధిదారులు అధిక సంఖ్యలో ఉండటంతో 2014 నుంచి 2019 వరకు ఉన్న పరిస్థితితులను గుర్తుకు తెచ్చాయి.

పది పరీక్షల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలబెట్టాలి



ఓరియేంటేషన్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ సుబ్బారావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచి జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యు.వి సుబ్బారావు అన్నారు. గవర్నర్‌పేటలోని సీవీఆర్ మున్సిపల్ స్కూల్లో ఉపాధ్యాయుల ఓరియంటేషన్ కార్యక్రమం ముగిసింది. విజయవాడ నగరంలోని సెంట్రల్, నార్త్, ఈస్ట్, వెస్ట్ మండలాలకు చెందిన 605 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల నుద్దేశించి డీఈఓ యు.వి సుబ్బారావు మాట్లాడుతూ పదో తరగతి ఉత్తీర్ణత పెంచడానికి ఓరియంటేషన్ కార్యక్రమం దోహదం చేస్తుందని చెప్పారు. సిలబస్, బ్లూ ప్రింట్, మాదిరి ప్రశ్నాపత్రం గురించి వివరించారు. ఎఫ్ఏ-1 మార్కులను ఆన్‌లైన్ చేసి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులో నమోదు చేయాలని సూచించారు. ఈ నెల 14న వ తేదీ జరిగే మెగా పేరెంట్స్ మీటింగ్‌లో అందజేయాలన్నారు. సమావేశం రోజున తల్లిదండ్రులకు వివిధ పోటీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈసీబీ కార్యదర్శి షేక్ ఉమర్ ఆలీ, కోర్సు డైరెక్టర్ బాణోతు వెంకటేశ్వర్లు, సీవీఆర్ హై స్కూల్ ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంటి రాజు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

రేపు కార్తిక వన సమారాధన

కంకిపాడు: బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కంకిపాడులో కార్తిక వన సమారాధన నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు డాక్టర్ దీవి రాధాకృష్ణ శ్రీనివాస్, కార్యదర్శి కానూరు భాస్కర్‌రావు, ఉపాధ్యక్షుడు ఉపద్రష్ట గంగాధర్‌రావు, ట్రెజరర్ దీవి రోహిణికుమార్ తెలిపారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని పవన్ గాయత్రీ ధ్యానమందిర్‌లో ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు వన సమారాధన ప్రారంభమవుతుందని చెప్పారు. దంపత పూజ, అన్నసమారాధన నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులు సాఫ్టుస్కిల్స్‌పై దృష్టి పెట్టాలి

పెనమలూరు: విద్యార్థులు సాఫ్టుస్కిల్స్‌పై దృష్టి పెట్టాలని బహుళజాతి సంస్థ డెలాయిట్ ఇండియా రిస్కు ఎడ్వైజరీ కన్సల్‌టెంట్ తులసీపాటిల్ అన్నారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో లీడర్‌షిప్, కమ్యూనికేషన్ స్కిల్ అనే అంశంపై జరిగిన సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు సాఫ్టు స్కిల్స్ సాధిస్తేనే లక్ష్యం చేరుకోగలుగుతారని చెప్పా రు. సాఫ్టుస్కిల్స్ వ్యక్తిగత, వృత్తి విజయాలకు కీలకమన్నారు. సాఫ్టు స్కిల్స్ విద్యార్థికి దశ నిర్దేశం ఇస్తుందని అన్నారు. దీని వల్ల కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, ఎంబీఏ విభాగాధిపతి పి.ఆదిలక్ష్మి, డాక్టర్ పద్మనాభరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

4న విశ్రాంత ఉద్యోగుల సమావేశం

గన్నవరం: స్థానిక బుద్దవరం రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవా భవన్‌లో ఈనెల 4వ తేదీ ఉదయం 10.30 గంటలకు 2010-14 రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు ఆవుటపల్లి మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన పలు సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 2010-14 మధ్య పదవీ విరమణ చేసిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కంకిపాడు: ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. శుక్రవారం కంకిపాడులో లబ్ధిదారులకు దీపం పథకం కింద గ్యాస్ సిలెండర్లను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ ఇచ్చిన హామీకి అనుగుణంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. కంకిపాడు పట్టణంలో ప్రధాన డ్రెయినేజీ సమస్య ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉందన్నారు. ఏడాదిలోపు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, నాయకులు ముప్పా రాజా, తుమ్మలపల్లి హరికృష్ణ, జయప్రకాష్, వణుకూరు విక్రమ్, తహసీల్దార్ వి. భావన్నారాయణ, ఎంపీడీఓ పి. అనూష పాల్గొన్నారు.

బాణసంచా గోడౌన్ వద్ద యువకుల వీరంగం

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు సమీపంలోని బాణసంచా గోడౌన్ వద్ద మద్యం సేవించిన మైకంలో ఇరువురు యువకులు వీరంగం సృష్టించిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి బాణసంచా గోడౌన్ మూసివేసే సమయానికి మద్యం సేవించిన ఇరువురు యువకులు అక్కడికి చేరుకున్నారు. తమకు బాణసంచా సామగ్రి ఇవ్వాలంటూ సదరు గోడౌన్ యాజమాని, సిబ్బందిపై గొడవకు దిగారు. లేకపోతే గోడౌన్‌లోని బాణసంచా సామగ్రిని తగులబెడతామని అగ్గిపుల్లలు గీస్తూ బెదిరింపులకు దిగారు. దీంతో భయాందోళనకు గురైన గోడౌన్ యాజమాని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువురు యువకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించినట్లుగా పోలీసులు తెలిపారు.

11 నుంచి బ్యూటీషియన్ కొత్త బ్యాచ్‌కు శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 11వ తేదీ నుంచి బ్యూటీషియన్ కోర్సులో కొత్త బ్యాచ్‌కు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం మహిళా విభాగం ఇన్‌చార్జి పి. విజయ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా శిక్షణ విభాగం ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక బ్యాచ్‌లకు టైలరింగ్, బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీ, పెయింటింగ్, మిషన్ ఎంబ్రాయిడరీల్లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశామని పేర్కొన్నారు. కొత్త బ్యాచ్‌కు రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఇస్తారని తెలిపారు. మూడు నెలల పాటు జరిగే శిక్షణకు ఆసక్తి గలవారు ఈ నెల 10వ తేదీలోపు ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 73821 93413, 94900 98021 నంబర్లలో సంప్రదించాలని కోరారు.